సాక్షి
వికారాబాద్
సోమవారం : 26 : మే : 2025



సిరులు కురిపిస్తున్న మూసీ!

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ప్రధాన జల వనరైన మూసీ నది మే నెలలో సైతం నీటితో కళకళలాడుతోంది.
8లో▸



నత్తనడకన నిర్మాణ పనులు

గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో అధికారులు, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.
8లో▸



బిల్లుల సంగతేంటి?

కులగణన డేటా ఎంట్రీకి సంబంధించిన బిల్లులు అందక ఆపరేటర్లు అవస్థలు పడుతున్నారు.
9లో▸

న్యూస్‌రీల్

బీజేపీ వికారాబాద్ పట్టణ కమిటీ ఏర్పాటు

అనంతగిరి: బీజేపీ వికారాబాద్ పట్టణ కమిటీని నియమించినట్లు పార్టీ పట్టణ అధ్యక్షురాలు యాస్కి శిరీష తెలిపారు. పట్టణ ఉపాధ్యక్షులుగా విజయలక్ష్మి, అశోక్ ముదిరాజ్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌చారి, ప్రధాన కార్యదర్శులుగా ఉప్పు అమర్‌నాథ్, వెంకట్, కార్యదర్శులుగా ప్రశాంత్, గిరిజ, వినోద్, సువానీ, కోశాధికారిగా రాంమోహన్‌తో పాటు పలువురిని కార్యవర్గ సభ్యులుగా నియమించినట్లు ఆమె తెలిపారు.

ధాన్యం మిల్లులకు తరలించండి

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ధారూరు: రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను వెంటనే రైస్ మిల్లులకు తరలించాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ నిర్వాహకులకు సూచించారు. మండలంలోని గట్టెపల్లి కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలు పడుతున్నందున ధాన్యం బస్తాలు తడిసే అవకాశం ఉందని, వెంటనే మిల్లులకు తరలించాని ఆదేశించారు.

ఈసెట్‌లో సత్తా చాటిన విద్యార్థులు



శ్రీశైలం(3వ ర్యాంక్)

అనంతగిరి: పాలిటెక్నిక్ పూర్తి చేసి నేరుగా ఇంజనీరింగ్‌లో ప్రవేశం పొందడానికి ప్రభుత్వం నిర్వహించిన ఈసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలు ఆదివారం విడుదలయ్యాయి. వికారాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే రవీందర్ తెలిపారు. ఈసీఈ బ్రాంచ్ విద్యార్థులు గొల్ల శ్రీశైలం 3వ ర్యాంక్, గొల్ల స్వామి 62వ ర్యాంక్, అక్షయ 95వ ర్యాంక్, డి.అక్షయ్ రెడ్డి 103 ర్యాంక్, టి.సందీప్ 131 ర్యాంక్, ఎం.పృథ్వీరాజ్ 158వ ర్యాంక్ సాధించారు. వీరిని ప్రిన్సిపాల్‌తో పాటు ఈసీఈ ఇన్‌చార్జ్ లక్ష్మీనారాయణ, అధ్యాపకుడు జయచంద్రారెడ్డి అభినందించారు.

దేశ రక్షణ బీజేపీతోనే సాధ్యం



మన్‌కీబాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

పూడూరు: దేశ రక్షణతో పాటు అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్ పటేల్ అన్నారు. ప్రధాని మోదీ తలపెట్టిన మన్‌కీబాత్ కార్యక్రమాన్ని ఆదివారం పూడూరులో స్థానిక నాయకులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుని దేశ ప్రజలకు రక్షణగా నిలిచారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, నాయకులు శ్రీశైలం, సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రామపాలన అధికారి ఎంపిక పరీక్ష



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఇతర అధికారులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో ఆదివారం నిర్వహించిన గ్రామపాలన అధికారి ఎంపిక పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ ప్రతీక్ జైన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరీక్షకు 150 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 143 మంది వచ్చారని తెలిపారు. అంతకుముందు అధికారుల సమక్షంలో పరీక్ష పేపర్లకు సబంధించిన సీల్ ఓపెన్ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్, డీటీడీఓ కమలాకర్‌రెడ్డి, ఆర్‌డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, సెక్షన్ సూపరింటెండెంట్ నేహామత్ అలీ తదితరులు పాల్గొన్నారు.



కూల్‌కూల్‌గా..

కోట్‌పల్లి ప్రాజెక్టులో పర్యాటకులు సందడి చేశారు.. ఆదివారం కావడంతో పలు ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో జనం వచ్చారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రాజెక్టు నీటిలో ఎంజాయ్ చేశారు. వాతావరణం చల్లగా ఉండటంతో హాయిగా సేద తీరారు. సమీప అటవీ ప్రాంతలో వంటలు చేసుకొని ఆరగించారు. యువత పోటీపడి బోటింగ్ చేశారు.

– ధారూరు

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

చేవెళ్ల: ఫర్టిలైజర్, సీడ్స్ దుకాణాల డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు అన్నారు. చేవెళ్లలోని రైతు వేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో డివిజన్‌లోని ఫర్టిలైజర్, సీడ్స్ డీలర్లకు ఈపాస్ యంత్రపరికరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన గుర్తింపు పొందిన విత్తనాలు, ఎరువులనే విక్రయించాలని పేర్కొన్నారు. తప్పనిసరిగా రసీదులు అందించాలన్నారు. లైసెన్స్‌లు కలిగిన డీలర్లు మాత్రమే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని సూచించారు. ఈపాస్ వినియోగంతో విక్రయాల వివరాలు పక్కగా నమోదవుతాయని చెప్పారు. కార్యక్రమంలో డివిజన్ ఏడీ సురేశ్‌బాబు, ఏఓ శంకర్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మా.. కరుణించమ్మా

రెండు విడతల్లోనూ స్థలాలు ఉన్నవారికే ఇందిరమ్మ ఇళ్లు



వికారాబాద్ మండలం పెండ్లిమడుగులో నిర్మాణ దశలో ఇందిరమ్మ ఇల్లు

- జిల్లాలో స్థలం లేని నిరుపేదలు 54,806 మంది
- ఆందోళనలో అర్హులు
- డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని విన్నపం

జిల్లాకు మొదటి విడతలో మంజూరైన ఇళ్లు	14వేలు
ఎంపిక చేసిన లబ్ధిదారులు	2,285మంది
రెండో విడతలో మరో	14వేల ఇళ్లు
ఎంపికైన వారు	2,929 మంది

వికారాబాద్: ప్రభుత్వం ఏదైనా నిరుపేదలను పట్టించుకోవడంలేదు.. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలోనూ వారికి ఇదే అనుభవం ఎదురవుతోంది. ప్రభుత్వం ఇళ్లు లేని పేదలను రెండు కేటగిరీలుగా విభజించింది. ఇందులో స్థలం ఉండి ఇళ్లు లేని వారు.. రెండో కేటగిరీలో స్థలం కూడా లేని అత్యంత పేదలు.. సాధారణంగా ఎలాంటి గూడు లేని పేదలను సంక్షేమంలో ముందు వరుసలో కూర్చోబెట్టాలి. కానీ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. స్థలాలు ఉన్న వారిని మొదటి విడతలో ఎంపిక చేయగా.. కనీసం కాసింత జాగా లేని వారిని ప్రాధాన్యతా క్రమంలో వెనక్కి నెట్టారు. రెండు విడతల్లోనూ స్థలాలు ఉన్నవారినే ఎంపిక చేశారు. దీంతో దారిద్య్రరేఖకు దిగువన ఉన్న వారు అయోమయంలో పడ్డారు. ఏడాది క్రితం ప్రజాపాలనలో భాగంగా ప్రభుత్వం ఇళ్ల కోసం దరఖాస్తులు స్వీకరించింది. జిల్లా నుంచి 2.57లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని పరిశీలించిన అధికారులు 1,48,668 మంది అర్హులని తేల్చారు. వీరిలో స్థలాలు కూడా లేని పేదలు 54,806 మంది ఉన్నట్లు గుర్తించారు.

నత్తను తలపిస్తున్న ఇళ్ల నిర్మాణం

ఏడాది గడిచినా జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఈ ప్రక్రియ మూడు అడుగులు ముందుకు ఏడు అడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది. ఇళ్ల పథకాన్ని ఎమ్మెల్యేలు అట్టహాసంగా ప్రారంభించారు కానీ వాటి నిర్వహణ విషయం మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 చొప్పున జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు 14వేల ఇళ్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు 2,285 ఇళ్లకు అనుమతులు మంజూరయ్యాయి. 300 నిర్మాణాలకు హౌసింగ్ అధికారులు మార్కింగ్ ఇచ్చారు. 77 మంది పునాది పనులు పూర్తి చేయడంతో వారికి రూ.లక్ష చొప్పున అందజేశారు. మిగతా ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. రెండో విడతలో మరో 14వేల ఇళ్లు మంజూరు కాగా.. 2,929 మందిని ఎంపిక చేశారు. అయితే లబ్ధిదారుల ఎంపిక విషయంలో అధికారులు.. నేతల మధ్య కోల్డ్ వార్ నడుస్తోంది. ఇంజనీర్ల కొరత కూడా పథకం అమలుపై ప్రభావం చూపుతోంది. జిల్లా మొత్తంలో ఈ పథకం అమలు చేసేందుకు ఒక పీడీ, నలుగురు డీఈలు, ముగ్గురు ఏఈలు మాత్రమే ఉన్నారు.

డబుల్ ఇళ్లు కేటాయించాలి

గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణం చేపట్టిన విషయం తెలిసిందే.. ప్రస్తుతం కొన్ని నిర్మాణాలు పూర్తి కాగా మరి కొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. స్థలాలు లేని వారు ఆ ఇళ్లను తమకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో జిల్లాకు 5,740 డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరయ్యాయి. 2016లో నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆ తర్వాత వీటి సంఖ్యను 3,800కు కుదించారు. ప్రస్తుతం 2,257 నిర్మాణ దశలో ఉండగా 1,031 ఇళ్లు దాదాపు పూర్తి కావచ్చాయి. 512 ఇళ్ల పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ధారూరులో 120 ఇళ్లు, మర్పల్లిలో 120, యాలాల మండలం కోకట్‌లో 180, తాండూరు పట్టణంలో 401, పరిగిలో 180, చౌడాపూర్ మండలం అడవి వెంకటాపూర్‌లో 30 డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి. వీటికి సంబంధించిన దరఖాస్తుల పరిశీలన కూడా ఏడాదిన్న క్రితమే పూర్తయ్యింది. కానీ ఇళ్ల కేటాయింపులో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రభుత్వం స్థలాలు కూడా లేని తమకు ఈ డబుల్ బెడ్‌రూం ఇళ్లను కేటాయించాలని పలువురు పేదలు కోరుతున్నారు.

నేడు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు

కుల్కచర్ల: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సోమవారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సంబంధించిన పత్రాలు అందజేయనున్నట్లు ఎంపీడీఓ రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తారని తెలిపారు.

యథేచ్ఛగా మూడు ముక్కలాట

- పల్లెలు, పట్టణాల్లో జోరుగా జూదం
- చేతులు మారుతున్న లక్షలాది రూపాయలు
- వీధిన పడుతున్న కుటుంబాలు
- పట్టించుకోని పోలీసులు

పరిగి: పరిగి నియోజకవర్గంలో పేకాట మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. నిత్యం లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. గ్రామాలు మొదలుకొని పట్టణాల వరకు జూదం ఆడుతున్నారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారు పరిగి పట్టణానికి వచ్చి పేకాట ఆడుతున్నారు. పట్టణాలతోపాటు ఆయా గ్రామాల శివారుల్లోని వ్యవసాయ పొలాలు, శిథిల భవనాలను అడ్డాగా చేసుకుంటున్నారు.

ఫాంహౌస్‌లు, లాడ్జిల్లో..

వేసవి సెలవులు కావడంతో కొంత మంది గ్రూపులుగా ఏర్పడి పేకాట ఆడుతున్నారు. ఇందుకోసం ప్రత్యేక స్థావరాలను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిసింది. బడాబాబులు రహస్య ప్రదేశాల్లో గుట్టుచప్పుడు కాకుండా కానిచ్చేస్తున్నారు. చీకటి పడింది మొదలు అర్ధరాత్రి వరకు ఇదే తంతు కొనసాగిస్తున్నారు. పరిగి పట్టణంలోని ఓ లాడ్జిలో నిత్యం పేకాట ఆడుతున్నట్లు సమాచారం. అలాగే పట్టణ శివారులోని ఫాంహౌస్‌లు, మన్నెగూడ పరిసర ప్రాంతాలను అడ్డాలుగా మార్చుకున్నట్లు సమాచారం. జూదంలో డబ్బులు పోగొట్టుకొని పలువురు రోడ్డున పడుతున్నారు. మరి కొంత మంది జీవితాలను బుగ్గిపాలు చేసుకుంటున్నారు. జూదాన్ని అరికట్టాల్సిన పోలీసులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం



పేకాట స్థావరాల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలి.. తమకు సమాచారం వచ్చిన వెంటనే దాడులు చేస్తున్నాం. గ్రామాలు, పట్టణాల్లో జూదం ఆడుతున్న వారిపై నిఘా ఉంచాం. పేకాట ఆడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– శ్రీనివాస్‌రెడ్డి, సీఐ, పరిగి

నేడు తలకొండపల్లికి డిప్యూటీ సీఎం

- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: తలకొండపల్లి మండలంలో సోమవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పర్యటించనున్నారు. ఖానాపూర్ గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.218 కోట్ల అభివృద్ధి పనులకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క శంకుస్థాపన చేయనున్నారు. రూ.200 కోట్లతో 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించే యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి, రూ.18 కోట్లతో నిర్మించే 8 విద్యుత్ సబ్‌స్టేషన్‌ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అనంతరం ఖానాపూర్‌లో జరిగే బహిరంగ సభలో మాట్లాడతారు. ఈ మేరకు పర్యటన ఏర్పాట్లను ఆదివారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరిశీలించారు. బహిరంగ సభకు నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల నుంచి జనసమీకరణ చేయనున్న నేపథ్యంలో కూర్చోవడానికి వీలుగా అదనంగా టెంట్లు వేయాలని సూచించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. డిప్యూటీ సీఎంతో పాటు మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, ఏఐసీసీ ప్రత్యేక ఆహ్వానితుడు చల్లా వంశీచంద్‌రెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎమ్మెల్యే వెంట పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పదవుల పందేరం!

- కష్టకాలంలో పార్టీ జెండా మోసిన వారికే మండల అధ్యక్ష పదవులు
- కొత్తవారికి అనుబంధ కమిటీల్లో చోటు
- నేటి నుంచి దరఖాస్తుల ఆహ్వానం

బషీరాబాద్: అధికార పార్టీలో పదవుల పందేరం మొదలైంది. పార్టీ సంస్థాగత నిర్మాణానికి టీపీసీసీ ఆదేశాలు జారీ చేయడంతో మండల కమిటీల ఏర్పాటుకు లైన్ క్లియర్ అయ్యింది. నేటి నుంచి ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. 2017 కంటే ముందు నుంచి పార్టీలో ఉన్న వారే మండల అధ్యక్ష పదవులకు అర్హులని అధిష్టానం స్పష్టం చేసింది. దీంతో ఏడాది క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్, బీజేపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన సీనియర్ నాయకుల ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యింది. పార్లమెంట్ ఎన్నికల సయమంలో కూడా బీఆర్‌ఎస్‌కు చెందిన ముఖ్య నాయకులు, ద్వితీయ శ్రేణి నేతలు హస్తం గూటికి చేరారు. వీరు సైతం మండల పదవులపై ఆశలు పెట్టుకున్నారు. పార్టీ నిర్ణయంతో వారికి పదవులు దక్కే అవకాశం లేదు. అయితే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సెల్ అధ్యక్ష, కార్యదర్శుల పదవుల్లో కొత్త వారికి చోటు ఇవ్వాలని టీపీసీసీ సూచించింది. ఇదిలా ఉండగా పార్టీ, నామినేటెడ్ పదవుల్లో చోటు కల్పిస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇవ్వడంతోనే తాము కాంగ్రెస్‌లో చేరినట్లు తాండూరుకు చెందిన ఓ నాయకుడు తెలిపారు. ఇప్పుడు కొత్త, పాత అని షరతులు పెట్టడమేంటని ప్రశ్నించారు. పార్టీ పదవుల కోసం ఆశావహులు దరఖాస్తు చేసుకోవాలని అధిష్టానం ఇప్పటికే సూచించింది. మండల అధ్యక్ష పదవులు ఎవ్వరికి ఇవ్వాలనే విషయాన్ని మండలాల వారీగా ముఖ్యనాయకులు సమావేశమై ముగ్గురు పేర్లు ఇవ్వాలని ఎమ్మెల్యేలు ద్వితీయశ్రేణి నాయకులకు సూచించారు. దీంతో ఆశావహులు పైరవీలు మొదలు పెట్టారు.

అందరికీ న్యాయం జరగాలి



పార్టీ పదవుల్లో పాత, కొత్త నాయకులను కలుపుకొని అందరికీ న్యాయం జరిగేలా అధిష్టానం చర్యలు చేపట్టాలి. పార్టీ కోసం పనిచేస్తున్న వారందరినీ సమన్వయం చేస్తూ కొత్త కమిటీలను ఏర్పాటు చేస్తే మంచిది.

– మాధవరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్, బషీరాబాద్

కళాకారులను గుర్తించాలి

హయత్‌నగర్: రాష్ట్రంలో వృత్తి కళాకారులకు తగిన గుర్తింపు లేక పోవడంతో జీవనాధారం కష్టంగా మారిందని, వారిని గుర్తించి ప్రభుత్వం పెన్షన్ అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి అన్నారు. ప్రజానాట్యమండలి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కుంట్లూరులోని రావినారాయణరెడ్డి కాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో, మలిదశ తెలంగాణ ఉద్యమంలో కళాకారులది కీలక పాత్ర అని పేర్కొన్నారు. వారిలో చదువుకున్న వారిని గుర్తించి సాంస్కృతిక శాఖలో ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకుడు హరిసింగ్‌నాయక్, మాజీ కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సీఎం ఇలాకాలో తాగునీటి ఎద్దడి

- మిషన్ భగీరథలో సాంకేతిక సమస్యలే కారణం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



కొడంగల్‌లోని వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్

కొడంగల్: నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి నెలకొంది. మిషన్ భగీరథ పథకంలో సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గమైనా మిషన్ భగీరథ అధికారుల్లో చలనం లేదు. రెండేళ్లుగా మంచి నీటి సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఒక్కోసారి రెండు మూడు రోజులు నీటి సరఫరా ఉండదు. సరఫరా చేసే రోజుల్లో గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని స్థానికులు తెలిపారు. నల్లాల్లో నామమాత్రంగా నీరు వస్తోందని మహిళలు ఆరోపిస్తున్నారు. ఎప్పుడు నీరు వస్తుందో.. ఎప్పుడు ఆగిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

గతమెంతో ఘనం

గతంలో మిషన్ భగీరథకు మంచి పేరు ఉండేది. రెండేళ్లుగా పథకం పని తీరులో మార్పు వచ్చింది. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో నీటి కష్టాలు మొదలయ్యాయి. గతంలో మిషన్ భగీరథ ద్వారా నియోజకవర్గంలోని ఇంటింటికీ మంచినీటి సరఫరా జరిగేది. చాలా గ్రామాల్లో దాహార్తి తీరింది. ప్రస్తుతం శ్రీశైలం నుంచి వచ్చే నీటి సామర్థ్యం తగ్గింది. దీంతో కొడంగల్‌కు నీటిని సరఫరా చేసే స్థితిలో లేదు. పథకం ప్రారంభించిన కొత్తలో ఉదయం 6నుంచి 8 గంటల వరకు నీరు వదిలేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఉదయం ఆరున్నర నుంచి గంట కూడా సరిగ్గా రావడం లేదని మహిళలు వాపోతున్నారు. కొన్ని కాలనీల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉందని తెలిపారు. పాత కొడంగల్, పాత కొడంగల్ తండా, గుండ్లకుంట, కొండారెడ్డిపల్లి, బూల్కాపూర్ గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది.

సుదూరం నుంచి..

శ్రీశైలం నుంచి కొడంగల్‌కు నీటి సరఫరా జరుగుతుందంటే మొదట్లో ఎవరూ నమ్మలేదు. 283 కిలోమీటర్ల దూరంలో ఉన్న కృష్ణానది నుంచి మిషన్ భగీరథ పథకంలో కొడంగల్‌కు వచ్చిన నీటిని చూసి జనం ఆశ్చర్యపోయారు. శ్రీశైలం నుంచి పాతాళగంగ కొడంగల్‌కు వస్తుంటే జనం పులకరించి పోయారు. పట్టణ శివారులోని సిద్దనొంపు సమీపంలో ఉన్న వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (డబ్లుటీపీ) నుంచి గ్రామాల్లో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీటిని పంపింగ్ చేసి కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ మేలు చేసిందని జనం మెచ్చుకున్నారు. అయితే ప్రస్తుతం ఏమి జరిగిందో కానీ పూర్తి స్థాయిలో నీటి సరఫరా కావడం లేదనే అపవాదును మూటగట్టుకుంది. ఈ విషయంపై మిషన్ భగీరథ అధికారులను వివరణ కోరగా శ్రీశైలం నుంచి నీరు రావడం లేదని అంటున్నారు. ఒక్కోసారి సాంకేతిక సమస్యలు వస్తున్నాయని చెబుతున్నారు. పూర్తి స్థాయిలో నీరు రాకపోవడం వల్ల సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని తెలిపారు.

భూములు లాక్కొని పొట్టకొట్టొద్దు

రైతుల ఆందోళన



ఆందోళన చేపడుతున్న రైతులు

తుర్కయంజాల్: అబ్దుల్లాపూర్ మెట్ మండలం కొహెడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 187/1లో 50 ఏళ్లుగా వ్యవసాయం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నామని, ప్రభుత్వం తమ భూమిని లాక్కోవడానికి ప్రయత్నం చేస్తోందని పలువురు రైతులు వాపోయారు. కొహెడలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీవనాధారంగా ఉన్న భూమిని లాక్కొని తమ పొట్ట కొట్టొద్దని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవలి కాలంలో రెవెన్యూ అధికారులు 288 ఎకరాలకు ప్రీకాస్ట్ వాల్ ఏర్పాటు చేశారని, సుమారు 100కుపైగా రైతు కుటుంబాలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వాలు భూమి లేని కుటుంబాలు వ్యవసాయం చేసుకుని బతకడానికి కుటుంబానికి ఎకరం, రెండు ఎకరాల చొప్పున కేటాయించాయని.. అప్పటి నుంచి ఆ భూముల్లో పలు రకాల పంటలు పండిస్తున్నామని తెలిపారు. భూములను లాక్కుంటే చూస్తూ ఊరుకోమని, పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. అధికారులు భూములను లాక్కునే ప్రయత్నాలు మానుకుని పట్టాలు పంపిణీ చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఆలయ వార్షికోత్సవం



వరసిద్ధి వినాయక దేవాలయం

తాండూరు టౌన్: పట్టణంలోని ఆదర్శ తులసీ నగర్‌లో శ్రీ వరసిద్ధి వినాయక దేవాలయ 15వ వార్షికోత్సవం సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు స్వామివారి సుప్రభాత సేవ, 7 గంటలకు ధ్వజారోహణం, 8 గంటల వరకు అభిషేకం, 9.30 గంటల వరకు భగవద్గీత పారాయణం, గణపతి హోమం, 10.30 గంటల నుంచి భక్త సురేష్ ప్రవచనం, అనంతరం పేరిణి శివతాండవం నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు. అనంతరం మధ్యాహ్నం 1 గంట నుంచి మహాప్రసాద వితరణ జరుపనున్నట్లు తెలిపారు. కావున భక్త జనులందరూ వార్షికోత్సవానికి హాజరై స్వామి వారి కరుణాకటాక్షాలు పొందాలని కోరారు.

రేపు టీబీ ముక్తభారత్ అభియాన్

దౌల్తాబాద్: మండలంలోని మాటూరు గ్రామంలో ఈనెల 27న మంగళవారం టీబీ ముక్తభారత్ అభియాన్ సంస్థ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణపై ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారిణి అమూల్య తెలిపారు. ఈ శిబిరంలో వ్యాధి లక్షణాలు ఉన్న వారికి పరీక్షలు జరుపుతున్నట్లు చెప్పారు. రెండు వారాలు జ్వరం, ఛాతిలో నొప్పి ఉన్నవారు పరీక్షించుకోవాలన్నారు. ఈ శిబిరానికి జిల్లా క్షయవ్యాధి నివారణ అధికారి రవీందర్‌యాదవ్ హాజరవుతారని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

మందుల పిచికారీతో ఎండిన పంట



ఎండుముఖం పట్టిన కొత్తిమీర

పరిగి: ఫర్టిలైజర్ మందుల దుకాణదారుడి నిర్వాకంతో ఓ రైతు పంటను ఎండ బెట్టుకున్న సంఘటన మండల పరిధిలోని రాఘవపూర్‌లో చోటు చేసుకుంది. బాధితుడి కథనం ప్రకారం .. గ్రామానికి చెందిన రాములు తనకున్న 15 గుంటల పొలంలో కొత్తిమీరను సాగు చేశాడు. పంట చేతికి వచ్చిన సమయంలో ముందు జాగ్రత్తగా శనివారం పట్టణ కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో మందులను కొనుగోలు చేసి పంటపై పిచికారీ చేశారు. మరుసటి రోజు కొత్తిమీర ఎండు ముఖం పట్టింది. దీంతో రైతు దుకాణదారుడి దగ్గరకు వెళ్లి నిలదీశాడు. ఈ క్రమంలో నిర్వాహకులు రైతుతో వాగ్వాదానికి దిగి బెదిరించారు. చేతికి వచ్చిన పంట నాశనం అయిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో జింక మృతి



జింక కళేబరం

కందుకూరు: రోడ్డు ప్రమాదంలో రాష్ట్ర జంతువు జింక మృతి చెందింది. ఈ సంఘటన శనివారం రాత్రి శ్రీశైలం హైవే రాచులూరు గేట్ సమీపంలోని పెద్దమ్మ దేవాలయం వద్ద చోటు చేసుకుంది. రాత్రి సమయంలో రోడ్డు దాటుతున్న జింకను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఆదివారం ఉదయం సమాచారం అందుకున్న గుమ్మడవెల్లి అటవీ శాఖ అధికారి విజయ్‌భాస్కర్ సిబ్బందితో ఆ జింకను రాచులూరు పశువైద్యశాలకు తరలించారు. కాగా పశువైద్యుడు డాక్టర్ షాహీన్‌షేక్ ఆ జింకకు పోస్టుమార్టం నిర్వహించి, అటవీ అధికారులకు అప్పగించగా దానికి వారు అంత్యక్రియలు నిర్వహించారు.

సిరులు కురిపిస్తున్న మూసీ!



గంగ్యాడ వద్ద మూసీ నదిలో పారుతున్న నీరు



గొల్లగూడలో సాగు చేసిన ఆకుకూరలు

వేసవిలోనూ ఇంకిపోని నది

- పంటలతో కళకళలాడుతున్న పరీవాహక ప్రాంతాలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతులు

నవాబుపేట: ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు ప్రధాన జల వనరైన మూసీ నది మే నెలలో సైతం నీటితో కళకళలాడుతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు గతంలో ఎన్నడూ లేనంతగా నది పారుతుంది. దీంతో పరీవాహక రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏటా వేసవి వచ్చిందంటే పశువులకు సైతం చుక్క నీరు లభించని మూసీ వాగులో ప్రస్తుతం జల సిరులు సందడి చేస్తున్నాయి. దీంతో ఎందరో రైతుల బతుకులకు భరోసా ఏర్పడింది. నవాబుపేటమండలంలో సుమారు 20 కిలో మీటర్ల పొడవునా మూసీ ప్రవహిస్తుంది. ఏటా సంక్రాంతి వచ్చే సరికి వాగులో చుక్క నీరు ఉండేది కాదు. కానీ ఈసారి మాత్రం వేసవిలో భారీ వర్షాలు కురవడంతో నది(వాగు) ఇంకా పారుతుంది. ఆ నీటిని సాగుకు ఉపయుక్తంగా స్థానిక కర్షకులు చేసుకొని ఉపాధి పొందుతున్నారు.

500 ఎకరాల్లో కూరగాయల సాగు

మండలంలోని చించల్‌పేట, అత్తాపూర్, చిట్టిగిద్ద, అక్నాపూర్, పులుమామిడి, నారెగూడ, లింగంపల్లి, గొల్లగూడ, గంగ్యాడ, ఎల్లకొండ, గుబ్బడి పత్తేపూర్, ముబారక్‌పూర్ గ్రామాల భూములు మూసీ నది పక్కన ఉన్నాయి. దీంతో ఆయా రైతులు మూసీ నది కింద దాదాపు 500లకు పైగా ఎకరాల్లో వరి, జొన్న, పంటలతో పాటు కూరగాయలను సాగు చేస్తున్నారు. ఈసారి వేసవిలో సైతం అప్పుడప్పుడు భారీ వర్షాలు కురవడంతో ప్రస్తుతం మూసీలో నీటి నిల్వలు ఉన్నాయి. ఫలితంగా రైతులు ఆ నీటిని ఉపయోగించుకుంటూ లాభాలు గడిస్తున్నారు. ప్రస్తుతం నది పరిసర ప్రాంతాలు పచ్చని పంటపొలాలతో కళకళలాడుతున్నాయి.

ఆకుకూరలు వేశాం



వర్షాలు ఈసారి వేసవిలో బాగా కురవడంతో నదిలో నీళ్లు సైతం బాగున్నాయి. ఏటా జనవరి వచ్చేసరికి వాగులో నీళ్లు పూర్తిగా ఎండిపోయేవి. ఈసారి మాత్రం ఇంకా నీళ్లు పారుతున్నాయి. నదిలో నుంచి నీళ్లు పారపెడుతూ ఆకుకూరలు సాగు చేశాను. మంచి లాభాలు వస్తున్నాయి.

– వెంకటయ్య, రైతు, గొల్లగూడ

సమృద్ధిగా నీరు



ప్రతి సంవత్సరం జనవరి వచ్చేసరికి మూసీ నదిలో ఎక్కడా నీళ్లు ఉండేవి కావు. పశువులకు కూడా చుక్క నీరు దొరకకుండే. ఈసారి మాత్రం ఇంకా నీటి నిల్వలు ఉన్నాయి. నది పరిసర ప్రాంతాల్లో ఉన్న బోర్లు, బావుల్లో కూడా నీళ్లు సమృద్ధిగానే ఉన్నాయి.

– నాగేశ్, రైతు, గొల్లగూడ

సమస్య రాలేదు



మూసీ నదిలో ఇంకా నీళ్లు ఉండటంతో పక్కన ఉన్న బోర్లు, వ్యవసాయ బావుల్లో సైతం బాగా పని చేస్తున్నాయి. దీంతో ఈసారి ఆకు కూరలు అధికంగా పండిస్తున్నాం. ఏటా ఈ సమయంలో బోర్లలో నీళ్లు తక్కువ అయ్యేవి. కానీ ఈసారి మాత్రం ఆ సమస్య ఉత్పన్నం కాలేదు.

– కిష్టయ్య, రైతు, ముబారక్‌పూర్

ఘనంగా సామూహిక కుంకుమార్చన

మహాదేవుని ఆలయంలో శ్రీమాణికేశ మహాసంస్థాన్ పీఠాధిపతి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో స్వామివారు

కొడంగల్ రూరల్: పట్టణంలోని శ్రీమహాదేవుని ఆలయంలో ఆదివారం మాస శివరాత్రిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ భజన మండలి ఆధ్వర్యంలో లింగాష్టక పారాయణం, అనంతరం పాలు, పెరుగు, తేనె, నెయ్యి, చక్కెర, సుగంధ ద్రవ్యాలతో స్వామివారికి పంచామృతాభిషేకం చేశారు. సాధు పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు, శ్రీమాణికేశ మహాసంస్థాన్ పీఠాధిపతులు శంకర్ స్వామిజీ ఆధ్వర్యంలో పార్వతీమాత అమ్మవారికి, మహాలక్ష్మి అమ్మవారికి 201మంది మహిళలతో సామూహిక కుంకుమార్చన చేశారు.

భక్తిభావవనతో ఏదైనా సాధ్యం

భారతదేశం సంస్కృతీ, సాంప్రదాయాలకు నిలయమని శ్రీమాణికేశ మహాసంస్థాన్ పీఠాధిపతులు శంకర్ స్వామిజీ అన్నారు. భక్తిభావనతో ఏదైనా సాధించవచ్చని, ప్రతిఒక్కరూ రోజులో కొంత సమయం ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని అన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలలో గత 5 నెలలుగా పర్యటిస్తూ ఇప్పటివరకు 6వేలకు పైచిలుకు విగ్రహాలను పంపిణీ చేసినట్లు, రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ 16వందల విగ్రహాలు, ఆదివారం కొడంగల్‌లోని శ్రీమహాదేవుని ఆలయంలో 201విగ్రహాలను మహిళలకు అందించినట్లు ఆయన తెలిపారు. భగవంతుని భక్తితో ఆరాధిస్తే శక్తిసామర్థ్యాలు పెరుగుతాయని అన్నారు. సాయంత్రం వీరశైవ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఆర్.గురునాథ్‌రెడ్డి కుటుంబసభ్యులు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు నారాయణ, రవికిరణ్, పుండరీక, వెంకటయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, కొడంగల్ వీహెచ్‌పీ, హిందూవాహిని కార్యకర్తలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శంకర్ స్వామిజీ

నత్తనడకన నిర్మాణ పనులు



నందారంలో అసంపూర్తిగా వదిలేసిన పంచాయతీ భవనం

- నిధులలేమితో పంచాయతీ భవనాలకు గ్రహణం
- అవస్థలు పడుతున్న గ్రామస్తులు, అధికారులు

దౌల్తాబాద్: నత్తనడకన సాగుతున్న గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులతో అధికారులు, గ్రామస్తులు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. పంచాయతీలకు సొంత భవనాలు నిర్మించాలనే సంకల్పంతో గత ప్రభుత్వ హయాంలో దౌల్తాబాద్ మండలంలోని ఒక్కో గ్రామానికి రూ.20 లక్షల చొప్పున 21 పంచాయతీలకు నిధులు మంజూరు చేసింది. భవన నిర్మాణ పనులను 8 పంచాయతీల్లో సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు చేపట్టారు. 12 పంచాయతీల్లో అసలు పనులే ప్రారంభించ లేదు. నిధులు సరిపోకపోవడంతో మధ్యలోనే పనులు వదిలేశారని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సొంత భవనాలు లేకపోవడంతో సమావేశాలు నిర్వహించడానికి, పంచాయతీల్లోని రికార్డులు భద్రపర్చుకోవడానికి భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇంతలోనే ప్రభుత్వం మారడంతోపాటు సర్పంచుల పదవీకాలం ముగియడంతో భవన నిర్మాణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది.

మంజూరైన గ్రామ పంచాయతీలు

అల్లాపూర్, బండివాడ, గుముడాల, కుప్పగిరి, లొట్టికుంటతండా, నందారం, నంద్యానాయక్‌తండా, నీటూరు, పోల్కంపల్లి, చంద్రకల్, సుల్తాన్‌పూర్, సురాయిపల్లి, దేశాయిపల్లి, యాంకి, చల్లాపూర్, ఇండాపూర్, కొడీడ్, ఈర్లపల్లి, ఊరగుంట, నాగసార్, సంగాయిపల్లి గ్రామపంచాయతీలకు 2022లో ప్రభుత్వం పంచాయతీలకు పక్కా భవనాలు మంజూరు చేసింది. అయితే 21 పంచాయతీల్లో నంద్యానాయక్‌తండా, ఎల్‌జీతండా, సురాయిపల్లిలో మాత్రమే పూర్తయింది. మిగిలిన 12 పంచాయతీల్లో పనులు ప్రారంభం కాలేదు. 6 పంచాయతీల్లో చేపట్టిన పనులు వివిధ దశల్లో ఉన్నాయి. పోల్కంపల్లిలో పిల్లర్ల వరకు నిర్మించారు. నందారంలో స్లాబ్ వరకు పనులు జరిగాయి. ఇలా కొన్ని గ్రామాల్లో అసంపూర్తి దశలో ఉన్నాయి. ఈ విషయమై పీఆర్‌ఏఈ నాగేంద్రకుమార్‌ను వివరణ కోరగా.. ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో మంజూరైన భవనాలు నిర్మించడం లేదన్నారు. ప్రస్తుతం కడాలో మంజూరు చేయించి పూర్తి చేయిస్తున్నాం. త్వరలో పూర్తయ్యేలా చర్యలు చేపడతామని తెలిపారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: మహిళను మానసికంగా వేధింపులకు గురి చేస్తున్న ఓ వ్యక్తిపై ఆదిబట్ల పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రాజు కథనం ప్రకారం.. తుర్కయంజాల్‌లో నివాసం ఉండే ఓ మహిళకు ఆరేళ్ల క్రితం ఓ వ్యక్తితో ప్రేమ వివాహం జరిగింది. ఆమెకు ప్రస్తుతం ఇద్దరు పిల్లలున్నారు. ఆర్థిక సమస్యలతో 2022లో సదరు మహిళ బొంగ్లూర్‌లోని ఈకామ్ ఎక్స్‌ప్రెస్‌లో 8 నెలలు సెక్యూరిటీగా పని చేసింది. ఆ సమయంలో సహోద్యోగి ప్రవీణ్‌తో ఆమెకు స్నేహం ఏర్పడింది. అనంతరం ఆమె ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఉంది. కానీ ప్రవీణ్ నిత్యం ఫోన్ చేసి మాట్లాడి మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఆమె చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు తెలిపారు.

పాదచారుడిని ఢీకొట్టిన కారు

ఇబ్రహీంపట్నం రూరల్: రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు ఓ పాదచారుడిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతడి కాలు విరిగిపోయింది. ఈ సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తుర్కయంజాల్‌లోని సూర్యనగర్ కాలనీకి చెందిన పున్న ఎల్లయ్య(73) సాగర్ హైవేపై కమాన్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. బీఎన్‌రెడ్డి నుంచి ఇబ్రహీంపట్నం వైపు వస్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన ఎడమ కాలుకు తీవ్ర గాయమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

బస్సు చక్రం కింద పడిన మహిళ

తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చేరిక



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలమణి

తాండూరు రూరల్: ఆర్టీసీ బస్సు చక్రం కింద పడి ఓ మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని కరన్‌కోట్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బాయమోళ్ల బాలమణి ఆదివారం ఉదయం కరన్‌కోట్ బస్టాండ్ వద్ద తన తల్లిని తాండూరు పట్టణానికి పంపించేందుకు వచ్చింది. ఆర్టీసీ బస్సులో వృద్ధురాలైన తన తల్లిని ఎక్కించి కిందికి దిగుతుండగా.. డ్రైవర్ ఒక్కసారిగా ముందుకు కదిపాడు. దీంతో బాలమణి కింద పడడంతో ఎడమకాలుపై నుంచి బస్సు చక్రం వెళ్లింది. స్థానికులు వెంటనే ఆమెను పట్టణంలోని జిల్లా ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అటునుంచి మెరుగైన వైద్యం కోసం వికారాబాద్‌కు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఆర్టీసీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాల వ్యాన్‌ను ఢీకొన్న బైక్

ప్రమాదంలో యువకుడి మృతి

మాడ్గుల: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కోల్కులపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మేకల గోపయ్య(23) శనివారం రాత్రి శుభకార్యానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో స్నేహితుడి బైక్‌పై ఇంటికి వస్తున్నారు. మార్గమధ్యలో గ్రామ శివారులోని వైన్స్ సమీపంలో అదుపు తప్పి పాల వ్యాన్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో గోపయ్యకు తీవ్ర గాయాలవ్వడంతో మాల్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. స్నేహితుడు మహేశ్ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గాల్లో వేలాడుతున్న ప్రమాదం



చేవెళ్ల: విచ్చలవిడిగా వెలుస్తున్న హోర్డింగ్‌లు, బ్యానర్లతో ప్రమాదాలు పొంచి ఉన్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలోని షాబాద్ చౌరస్తాలో ఆదివారం ఓ హోర్డింగ్‌కు కట్టిన బ్యానర్ గాలికి చిరిగిపోయి విద్యుత్ హైటెన్షన్ వైర్లపై పడి ఇలా ప్రమాదకరంగా మారింది. ఏ మాత్రం గాలి అధికంగా వీచినా పెను ప్రమాదం సంభవించే ఆస్కారం లేకపోలేదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చినిగిపోయిన బ్యానర్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్

కుల్కచర్ల: నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్న ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రమేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు బొంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ప్రభాకర్ రెడ్డి, దండు రామకృష్ణలు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న క్రమంలో ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. అనుమతి పత్రాలు అడగ్గా డ్రైవర్లు లేవని చెప్పడంతో పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పచ్చిరొట్ట ఎరువుల జాడేది?

- జీలుగ, జనుము, పిల్లిపెసరు విత్తనాల ఊసెత్తని ప్రభుత్వం
- ఆశగా ఎదురుచూస్తున్న అన్నదాతలు



ఆలేడ్‌లో సాగు చేసిన జీలుగ పంట (ఫైల్)

దుద్యాల్: పచ్చిరొట్ట ఎరువులకు సంబంధించి జనుము, జీలుగ, పిల్లిపెసరు వంటి వివిధ రకాల విత్తనాలు అందుబాటులో లేకపోవడంతో మండల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట సీజన్ ప్రారంభమైన తరుణంలో వ్యవసాయశాఖ అధికారులు సబ్సిడీపై పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను అందుబాటులో ఉంచకపోవడంపై కర్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట దిగుబడిలో ప్రభావం చూపే ఎరువుల విషయంలో నిర్లక్ష్యం తగదని పేర్కొంటున్నారు.

మెండుగా ప్రయోజనం

పశువుల పేడ, వర్మి కంపోస్టు ఎరువులు ఉపయోగిస్తే ఆశించిన మేర దిగుబడి పొందే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు. అలాంటి ఎరువులు అందుబాటులో లేని వారు మాత్రం పచ్చిరొట్ట విత్తనాలను పొలంలో చల్లుకుంటున్నారు. ముఖ్యంగా వరి పండించి పొలంలో జీలుగ, జనుము, పిల్లి పెసరు వంటి వాటిని వేసి ఎరువుగా మలుచుకుంటున్నారు. పంట సాగు చేసే ప్రారంభ సమయానికి పచ్చి రొట్ట పైరు ఏపుగా పెరిగి పూత దశకు చేరుకోవాలి. అప్పుడే మొక్కలు ఎరువుగా తయారవ్వడానికి ఉపయోగపడుతాయి. అంటే ప్రధాన పంట వేసే రెండు నెలల ముందే పచ్చిరొట్ట పైరు విత్తనాలు పొలంలో విత్తుకోవాలి. మొక్కలు ఏపుగా పెరిగిన తర్వాత యంత్రంలో కలియ దున్నాలి. భూమిలోనే మరిగిపోయి ఎరువుగా మారుతాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

ఎదురు చూస్తున్నాం



ఏటా మా పొలంలో పచ్చి రొట్ట ఎరువులుగా జనుము లేదా జీలుగ విత్తనాలను పొలంలో చల్లుకుంటాం. రెండు నెలల తర్వాత వాటిని భూమిలో కలియదున్ని కొన్నాళ్లు అలాగే ఉంచుతాం. అనంతరం నీటిని వదిలి దున్నుతాం. గతేడాది జనుము, జీలుగ విత్తనాలు అందుబాటులో ఉండే. కానీ ప్రస్తుతం అవి లేవు. ఎప్పుడు ఇస్తారని ఎదురు చూస్తున్నాం.

– నర్సింలుగౌడ్, రైతు, ఆలేడ్


అందుబాటులోకి తెస్తాం



పచ్చిరొట్ట విత్తనాలు చాలా మంది రైతులు అడుగుతున్నారు. మండలంలో అధికంగా వరి పండిస్తున్నారు. భూసారం పెంచే జనుము, జీలుగ, పిల్లి పెసరు వంటి విత్తనాలు చల్లుకోవడం చాలా మంచిది. ఇక్కడ చాలా మంది రైతులు వీటిని సాగు చేసుకుంటున్నారు. దుద్యాల్ అగ్రోస్ రైతు కేంద్రంలో అందుబాటులో ఉంచుతాం.

– నాగరాజు, ఏఓ, దుద్యాల్

భవనం పైనుంచి పడి మేస్త్రీ మృతి



టిక్యానాయక్ (ఫైల్)

కుల్కచర్ల: బతుకుదెరువు కోసం వలస వెళ్లిన భవన నిర్మాణ మేస్త్రీ ప్రమాదవశాత్తు భవనం నుంచి కిందపడి మృతి చెందిన ఘటన కుల్కచర్ల మండలంలో విషాదం నింపింది. స్థానికుల వివరాల ప్రకారం.. గోరిగడ్డ తండా గ్రామపంచాయతీలోని అంతిగానికుంటకు చెందిన టిక్యానాయక్(40) తన భార్య లక్ష్మి, కుమారులు సునీల్, విశాల్‌లతో కలిసి పూణెలోని వరోధ్యరాంనగర్ ప్రాంతంలో భవన నిర్మాణంలో మేస్త్రీగా పనిచేసేందుకు 25 ఏళ్ల క్రితం వెళ్లారు. అప్పటి నుంచి గ్రామంలో ఉన్న తల్లిదండ్రులు టీకీబాబు, బద్రియానాయక్‌ల దగ్గరకు అప్పుడప్పుడు వచ్చి వెళ్తుంటారు. ఇటీవల టిక్యానాయక్ అన్నకూతురి పెళ్లికి వచ్చి తిరిగి పూణె వెళ్లారు. ఆదివారం ఉదయం ఆయన 14 అంతస్తుల భవన నిర్మాణంలో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి మృతిచెందారు. ఆర్థిక ప్రగతి కోసం ఉన్న ఊరును వదిలి వెళ్లిన ఆయన విగత జీవిగా రావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సోమవారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

లిఫ్టు అడిగి.. మృత్యు ఒడికి

స్కూటర్ నుంచి జారిపడి మహిళ మృతి

చేవెళ్ల: లిఫ్టు అడిగి స్కూటర్‌పై వెళ్తున్న ఓ మహిళ ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందింది. ఈ సంఘటన చేవెళ్ల మున్సిపాలిటీ కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపల్లికి చెందిన మంగళి లక్ష్మి(32) చేవెళ్లలో వివేకానంద పాఠశాలలో ఆయాగా పనిచేస్తోంది. ఆదివారం ఉదయం ఆమె ఇంటి నుంచి పని కోసం బయలుదేరింది. ఆలస్యం కావడంతో స్కూల్ బస్సు వెళ్లిపోయింది. దీంతో ఆమె బైక్ మీద లిఫ్టుపై వెళ్తోంది. మార్గమధ్యలో చేవెళ్లకు సమీపంలోకి రాగానే స్కూటర్‌పై నుంచి లక్ష్మి ప్రమాదవశాత్తు జారి పడి తలకు గాయమైంది. వెంటనే స్థానికులు పట్నం మహేందర్‌రెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలు భర్త సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.